సాక్షి
కరీంనగర్
ఆదివారం । 21 । మే । 2023

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ అల్కాపురి కాలనీ ఫీడర్ పరిధిలోని అల్కాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



రేపటి నుంచి సీఎంకప్

జిల్లాస్థాయి సీఎంకప్ పోటీలు రేపటి నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0/26.0

వాతావరణం

ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహిళలను వేధిస్తే కఠిన చట్టాలున్నాయి



చొప్పదండి: ఆడపిల్లలను, మహిళలను వేధించే వారిపై చర్యలు తీసుకోవడానికి కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టుల సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశం అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిలుక రవిందర్ అధ్యక్షతన అంగన్‌వాడీ టీచర్లకు, చైల్డ్ హెల్ప్‌లైన్, 1098, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి మాట్లాడుతూ గృహహింస చట్టం, లైంగిక నిరోధక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కౌన్సిలర్ పి.భూమేశ్, న్యాయవాది మహేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

తిమ్మాపూర్ పంచాయతీ సందర్శన



తిమ్మాపూర్: తిమ్మాపూర్ పంచాయతీని అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్ వాట్సన్ టొప్పో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యతో కలిసి శనివారం సందర్శించారు. పరిపాలన విధానం, రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం, నర్సరీ, కంపోస్ట్ షెడ్, వైకుంఠదామం ,ప్లాంటేషన్, ఇంటింటికి చెత్త సేకరణ తదితర పనులను పరిశీలించారు. తర్వాత పీహెచ్‌సీని సందర్శించారు. గ్రామ పంచాయతీ అడ్మినిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ బాగుందని అభినందించారు. ఆయన వెంట ఎంపీపీ కేతి రెడ్డి వనితారెడ్డి, సర్పంచ్ దుండ్ర నీలమ్మ, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్ రావు, ఏపీవో రాజు తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలను పట్టించుకోని ప్రభుత్వం



మానకొండూర్: పొట్టకూటికోసం ఉపాధి పనులు చేస్తున్న కూలీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ మండిపడ్డారు. మానకొండూరు మండలంలోని గంగిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. రోజు ఎంతకూలి పడుతుందో అడిగి తెలుసుకున్నారు. డబ్బులు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్, ఎంపీటీసీ చలిగంటి సంపత్, మర్రి ఓదెలు, గసిగంటి సంపత్, గట్టు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

విద్యానగర్(కరీంనగర్): వచ్చే విద్యాసంవత్సరానికిగాను అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఉత్తమ జూనియర్ కళాశాల్లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు కోరారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలో 7.0 జీపీఏ ఆపై గ్రేడ్ సాధించిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి మెమో, కులం, ఆదాయ ధృవీకరణ, బ్యాంకు పాస్ బుక్, ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. షెడ్యూల్ కులాల వసతి గృహాల విద్యార్థులు మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్ జతచేయాల్సి ఉంటుందన్నారు. ప్రాధాన్య క్రమంలో మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత ఈపాస్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల ఎంపిక ఆటోమేటిక్‌గా జరుగుతుందన్నారు.

డీసెట్ దరఖాస్తు గడువు పెంపు

తిమ్మాపూర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ రెండు సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్ దరఖాస్తు గడువు ఈనెల 24 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. ఇంటర్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఓసీ, బీసీ విద్యార్థులు, 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు అర్హులన్నారు.

రంగినేని కెరటాలు

సండే స్పెషల్

- అమ్మానాన్నలను కోల్పోయినా ట్రస్ట్ ఒడిలో ఒదిగి.. ఉన్నతంగా చదివి
- దేశ విదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడి.. స్ఫూర్తిగా నిలుస్తున్న యువత

బాల్యం అమూల్యమైంది. అమ్మానాన్న ఒడిలో ఆనందంగా గడపాల్సిన సమయమది. కానీ.. పసిప్రాయంలోనే కన్నవాళ్లకు, అయినవారికి దూరమయ్యారు. ఇందులో తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన వారు కొందరైతే.. వివిధ కారణాలతో అమ్మ ఆప్యాయతకు, నాన్న అనురాగానికి నోచుకోని బాల్యం మరికొందరిది. తమ భవిష్యత్ ఏంటని ఆలోచన చేస్తున్న వారికి ఆ ట్రస్టు నీడగా నిలిచింది. చదువు చెప్పించింది. కడుపునిండా అన్నం పెట్టింది. ఉండడానికి ఆశ్రయాన్నిచ్చింది. ఆ ఆశ్రయాన్ని ఆసరాగా చేసుకుని అందనంత ఎత్తుకు ఎదిగారు ఆ చిన్నారులు. రంగినేని సుజాత మోహన్‌రావు చారిటబుల్ ట్రస్ట్‌లో చదివిన 55మంది వివిధస్థాయిల్లో.. హోదాల్లో దేశవిదేశాల్లో స్థిరపడ్డారు. ఉన్నతంగా స్థిరపడి 'రంగినేని కెరటాలు'గా పేరు పొందారు. - సిరిసిల్ల



రంగినేని ట్రస్ట్ పూర్వ విద్యార్థులు (ఫైల్)



ఈమె మొగిలి శిరీష. జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్. సొంతూరు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం దేశాయిపల్లి. శిరీష చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. స్థానిక ఆర్‌ఎంపీ రాజేశం, టీచర్ సత్యనారాయణ శిరీషను 4వ తరగతిలో ట్రస్ట్‌లో చేర్చారు. పదో తరగతి వరకు ట్రస్ట్‌లో చదువుకుని ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ హైదరాబాద్‌లో పూర్తిచేసింది. 2014లో పోలీస్‌కానిస్టేబుల్(సివిల్)గా ఎంపికై ప్రస్తుతం జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తోంది. భర్త రవి వ్యాపారం చేస్తున్నాడు. హిమజ అనే కూతురు ఉంది. తాను ఈ స్థాయిలో ఉండేందుకు 'రంగినేని' ట్రస్ట్ కారణమని శిరీష గర్వంగా చెబుతోంది.

ఇతను పడకంటి గోవర్ధన్‌చారి. జగిత్యాల జిల్లా రాయికల్. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. సమీప బంధువులు 2004లో సిరిసిల్ల పట్టణ శివారులోని 'రంగినేని' ట్రస్ట్‌లో చేర్పించారు. 8వ తరగతిలో చేరిన గోవర్ధన్ ఇక్కడే 10వ తరగతి, ఇంటర్ పూర్తిచేశాడు. 2011లో రాయికల్‌లో వుడ్ కార్వింగ్ షాపు ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఐదు యూనిట్లతో మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. రంగినేని మోహన్‌రావు ప్రేరణతో ఎదిగానని గోవర్ధన్ చెబుతున్నాడు.



ఎదిగిన వారెందరో..

ఆత్మహత్యలకు పాల్పడిన నేతకార్మికుల పిల్లలు, ఎన్‌కౌంటర్ బాధితుల పిల్లలు, అమ్మానాన్నలను కోల్పోయిన చిన్నారులకు కులమతాలకు అతీతంగా ట్రస్ట్‌లో ఆశ్రయం కల్పించారు. ట్రస్ట్‌లోనే అ..ఆలు నేర్చుకున్నారు. వివిధ తరగతుల్లో చేరిన వారు బీటెక్, ఎంటెక్, ఎల్‌ఎల్‌బీ, బీఎస్సీ, పాలిటెక్నిక్, బీఫార్మసీ, ఎంబీఏ చదువుకుని ఉద్యోగాలు సాధించారు. ట్రస్ట్‌లో చదువుకున్న పిల్లల్లో 35మంది ఉద్యోగాలు, మరో 20 మంది స్వయం ఉపాధి సాధించి జీవితంలో స్థిరపడ్డారు. ఉద్యోగాలు చేస్తున్నవారు తాము సంపాదిస్తున్న జీతంలో కొంత సొమ్మును రంగినేని ట్రస్ట్ నిర్వహణకు అందిస్తున్నారు కేవలం 14 మంది పిల్లలతో మొదలై 2020 నాటికి 224మంది వరకు ఆశ్రయం ఇచ్చింది. కరోనా లాక్‌డౌన్‌తో ట్రస్ట్‌ను తాత్కాలికంగా మూసివేసినా పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



గుజరాత్‌లో జాబ్ చేస్తున్నా



మాది తంగళ్లపల్లి మండలం చింతలఠాణా. తొమ్మిదేళ్ల ప్రాయంలో ట్రస్ట్‌లో చేరాను. ఆరేళ్లు చదువుకున్న. ఇంటర్ సీవీ రామన్ కాలేజీలో చేశాను. ఎంసెట్ రాసి ఉస్మానియా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ చేశాను. గుజరాత్‌లో లార్సెన్ అండ్ టూబ్రో కంపెనీలో మంచి వేతనంతో పని చేస్తున్నాను.
– గారిపల్లి సందీప్, గుజరాత్

మేమిద్దరం పని చేస్తున్నాం



నేను ట్రస్ట్‌లో పదోతరగతి వరకు చదివాను. హైదరాబాద్‌లో బీటెక్ చేశా. నా చదువులకు ట్రస్ట్ సాయం చేసింది. ఇప్పుడు క్యాప్‌జెమిని కంపెనీలో చేస్తున్న. మా ఆవిడ సౌమ్య టీసీఎస్‌లో చేస్తోంది. మోహన్‌రావు తాతయ్య, వెంకట్‌రావు సారు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించారు.
– తోనుపునూరి యశ్వంత్, వరంగల్

అమ్మానాన్న చనిపోయారు



మాది సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం రామవరం. మూడో తరగతిలోనే అమ్మానాన్న లక్ష్మి, గట్టయ్య చనిపోయారు. 2003లో రంగినేని ట్రస్ట్‌లో చేరాను. హైదరాబాద్‌లో పీజీ చేశాను. కాలేజీలో జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న. గ్రూప్స్ ప్రిపేర్ అవుతున్న. గాయకుడిగా గుర్తింపును రంగినేని ట్రస్ట్ కల్పించింది. ఎన్నో వేదికలపై పాడాను.
– జాతరకొండ సంపత్, రామవరం

పిల్లలు స్థిరపడితే తృప్తి



ట్రస్ట్‌లో చదువుకున్న పిల్లలు ఉద్యోగాలు సాధించి స్థిరపడడం తృప్తిగా ఉంది. నాకు చేతనైన సాయం చేయాలని ట్రస్ట్ పెట్టాను. కరోనాతో ఇబ్బంది ఏర్పడినా మా అబ్బాయి నవీన్, రిటైర్డు హెచ్‌ఎం తూడి వెంకట్రావు, ముత్యంరెడ్డి, రిటైర్డు ప్రిన్సిపల్ ప్రతాప్, ట్రస్ట్ సభ్యుల ప్రోత్సాహంతో మళ్లీ తెరిచాం. పేదలకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం.
– రంగినేని మోహన్‌రావు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు

అద్భుతంగా శ్రీవారి ఆలయం



ఆలయ నిర్మాణస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

- మంత్రి గంగుల కమలాకర్

విద్యానగర్(కరీంనగర్): ఏడుకొండల వాడు త్వరలోనే కరీంనగర్‌లో కొలువుదీరనున్నడని, టీటీడీ సహకారంతో కరీంనగర్‌లో శ్రీవారి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించనున్నట్లు బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని పశుసంవర్ధకశాఖ స్థలంలోని 10ఎకరాల్లో రూ.20కోట్లతో నిర్మించనున్న శ్రీవారి ఆలయ స్థలాన్ని టీటీడీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, కావేరి భాస్కర్‌రావు, దామోదర్‌రావు తదితరుల కృషితో శ్రీనివాసుడి ఆలయ నిర్మాణంతో కరీంనగర్ ఆధ్యాత్మికశోభ సంతరించుకుంటుందని అన్నారు. ఈనెల 31న ఆలయ భూమిపూజ, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవంలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, ఇతర అధికారులు హాజరు అవుతారని తెలిపారు. ఆలయ నిర్మాణ పనులు ఏడాదిన్నరలో పూర్తి అవుతాయని అన్నారు. 22న స్వామివారి గర్భగుడి నిర్మాణం వద్ద తొలిపూజ, బుకర్షణ పూజ జరుగుతుందని ఆయన తెలిపారు. టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నర్సింహామూర్తి, డీఈ నాగరాజు, ఏఈ చల్మానాయక్, అసిస్టెంట్ స్థపతి రవికాంత్, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్, పిల్లి మహేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ వచ్చాకే గ్రామాల్లో అభివృద్ధి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్, సుడా చైర్మన్ జీవీఆర్

చొప్పదండి: రాష్ట్రం ఏర్పడి సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే గ్రామాల్లో అభివృద్ధి ఊపందుకుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావులు అన్నారు. మండలంలోని కొలిమికుంటలో శనివారం రూ.1.50కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వారికి సర్పంచ్ తాళ్లపల్లి సుజాత శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాల్లోనూ బీఆర్‌ఎస్ లాంటి పాలన కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఏం పనులు చేశాడో గ్రామాల్లో నిలదీయాలని సూచించారు. సీఎం కేసీఆర్ కొండగట్టుకు రూ.100 కోట్లు కేటాయించారని, సంజయ్ రూ.1,000 కోట్లు కేటాయించగలడా అని ప్రశ్నించారు. పొన్నం అనిల్, చిలుక రవీందర్, గడ్డం చుక్కారెడ్డి, వెల్మ మల్లారెడ్డి, చీకట్ల రాజశేఖర్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి 'ట్రిపుల్‌ఆర్'

- పదిహేనురోజుల పాటు స్వచ్ఛషెహర్
- 40 డివిజన్‌లలో సెంటర్లు ప్రారంభం
- నేడు మరో 20 డివిజన్‌లలో ఏర్పాటు
- 22 నుంచి మొబైల్ ఆర్‌ఆర్‌ఆర్



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్ కార్పొరేషన్: ఇండ్లల్లో ఉండే చెత్త(పాతసామగ్రి)కు ఇక చెక్ పడనుంది. ఇప్పటివరకు పొడి చెత్త, తడి చెత్త సేకరిస్తున్న నగరపాలకసంస్థ పదిహేనురోజుల పాటు పాతసామగ్రిని కూడా కొనుగోలు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛషెహర్‌లో భాగంగా ఇండ్లల్లో ఉండే ఉపయోగం లేని వస్తువులను సేకరించేందుకు ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్,రీయూజ్, రీసైకిల్) సెంటర్లను నెలకొల్పింది. ఈ సెంటర్ల ద్వారా ఇండ్లల్లో ఉండే పాతసామగ్రిని కొనుగోలు చేసి, రీ సైకిల్‌కు, రీయూజ్‌కు తరలించడం ఈ ఆర్‌ఆర్‌ఆర్ లక్ష్యం.

60 డివిజన్లలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు

ఇండ్లల్లో వాడుకంలో లేని ప్లాస్టిక్, ఐరన్, పేపర్, క్లాత్ తదితర వస్తువులను ఈ ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్‌రీయూజ్,రీసైకిల్) సెంటర్ల ద్వారా నగరపాలక సంస్థ సేకరించనుంది. మెప్మా,శానిటేషన్ సిబ్బంది ఇందులో ప్రధానభూమిక పోషిస్తారు. నగరంలోని 60 డివిజన్‌లలో ఈ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. శనివారం 40 డివిజన్‌లలో సెంటర్లు ప్రారంభించగా, ఆదివారం మరో 20 డివిజన్‌లలో సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఆయా డివిజన్ ప్రజలు తమ ఇండ్లల్లో ఉండే ఉపయోగం లేని వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లలో ఇవ్వవచ్చు. ఇందుకు ఆయా వస్తువులను బట్టి కొంత నగదును కూడా ఇస్తారు. అంటే పాతసామగ్రిని స్క్రాప్ దుకాణాల్లో విక్రయించినట్లుగానే ఈ సెంటర్లలో కూడా విక్రయించుకోవచ్చు. కిలోల వారిగా వస్తువులను తూకం వేసి, అందుకు తగిన రుసుం ప్రజలకు చెల్లిస్తారు. ఇందుకోసం ఆయా సెంటర్లలో ధరల వివరాలను ప్రదర్శిస్తారు. తమ డివిజన్‌లలోనే సెంటర్లు ఏర్పాటు చేయడంతో, ప్రజలు పాతసామగ్రిని తొలగించుకొనేందుకు మొగ్గుచూపుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ సెంటర్లు కొనసాగనున్నాయి.

22 నుంచి మొబైల్ సెంటర్లు

ఇండ్ల నుంచి పాతసామగ్రిని పూర్తిగా తొలగించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న స్వచ్ఛషెహర్ కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు మొబైల్ సెంటర్లను కూడా అందుబాటులోకి తేనున్నారు. 60 డివిజన్‌లలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు ఏర్పాటు చేస్తుండగా, కొన్ని డివిజన్‌లు భౌగోళికంగా విస్తీర్ణం అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనితో ప్రజలు సెంటర్లకు రావడానికి ఇబ్బంది కలగకుండా సోమవారం నుంచి కొన్ని డివిజన్‌లలో మొబైల్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. మొబైల్ సెంటర్లు ఇండ్లల్లోకి వచ్చి పాతసామగ్రిని సేకరిస్తారు.

రీయూజ్...రీ సైకిల్

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల ద్వారా ఇండ్ల నుంచి సేకరించిన పాతసామగ్రిని డంప్‌యార్డ్‌కు పంపించకుండానే తొలగిస్తారు. సేకరించిన సామగ్రి ఆధారంగా రీయూజ్...రీ సైకిల్...దేనికి పంపించాలో చూసి ఆయా కేంద్రాలకు పంపిస్తారు. ప్లాస్టిక్,ఐరన్,క్లాత్ తదితర సామగ్రిని బట్టి హైద్రాబాద్, భద్రాచలం తదితర ప్రాంతాల్లో ఉన్న రీయూజ్,రీసైకిల్ సెంటర్లకు తరలించనున్నట్లు అధికారి ఒకరు తెలిపారు.

సెంటర్ ప్రారంభించిన అదనపు కలెక్టర్

నగరపాలకసంస్థ కళాభారతి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ శనివారం ప్రారంభించారు. నగరపాలకసంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్, అదనపు కమిషనర్ స్వరూపారాణి, రాజమనోహర్, స్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా మొదటి రోజు ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల ద్వారా 200 కిలోల ప్లాస్టిక్ వస్తువులు, 180 కిలోల పేపర్లు, 20 కిలోల చెప్పులు,షూ, 300 కిలోల ఇతర వస్తువుల (ఐరన్,క్లాత్ తదితర)ను కొనుగోలు చేశారు.

క్రమబద్ధీకరణ పేరుతో వీఆర్‌ఏ ఉద్యోగాలకు ఎసరు

- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): క్రమబద్ధీకరణ పేరుతో వీఆర్‌ఏలను తొలగించేందుకు ప్రభుత్వం కుట్రచేస్తోందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రెవెన్యూ వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఫైర్‌అయ్యారు. పదోతరగతి వరకు చదివిన వారిని మాత్రమే ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తోందని, అర్హతలేని వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వారసత్వంగా ఉద్యోగాల్లో చేరిన వారికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడితే ఉద్యోగాలు పెరుగుతాయని అనుకుంటే ఉన్న ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి దాపురించడం దారుణమన్నారు. ప్రభుత్వశాఖల కుదింపుతో ఉద్యోగుల మీద పనిఒత్తిడి పెరుగుతుందన్నారు. మండల ఆఫీసుల్లో సిబ్బంది కొరత కారణంగా ధరణిలో 10 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తల్లిలాంటి రెవెన్యూ శాఖను పట్టించుకోకుండా వ్యవస్థనే కనుమరుగు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టులు కట్టారని, అన్ని రకాల రుణాలు రద్దుచేసి రైతు బంధు తెచ్చి ప్రజలందరినీ కేసీఆర్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ లోపం లేదన్నారు. త్వరలో పార్టీ బలోపేతంపై రాహుల్‌గాంధీతో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో చొప్పదండి ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, నాయకులు సమద్ నవాబ్, మడుపు మోహన్, ఎండీ తాజ్, ముక్క భాస్కర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అఖిల్, కుర్ర పోచయ్య, నిహాల్ అహ్మద్, దన్ను సింగ్, ఎండీ చాంద్, బొబ్బిలి విక్టర్, కంకణాల అనిల్ కుమార్, పోరండ్ల రమేశ్, మెతుకు కాంతయ్య, విలాస్‌రెడ్డి, పురుమల్ల మనోహర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి ఫలితాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ చాటిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలు అందించి శాలువాలతో సత్కరించారు. నాయీబ్రాహ్మణ విద్యార్థుల్లో ఉత్సాహం తీసుకొచ్చేందుకు ప్రోత్సాహక పురస్కారాలు అందజేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగిరాల వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుదుర్తి విజయ్‌కుమార్, శ్రీరాములు బాల సురేందర్, గర్శకుర్తి నర్సయ్య, మొల్లంకుల సంతోశ్‌కుమార్, గర్శకుర్తి శంకర్, దామెరపల్లి శంకరయ్య, అవుదుర్తి భాస్కర్, కొత్వాల ఆంజనేయులు, గర్శకుర్తి విద్యాసాగర్, కల్యాణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు 15 సీట్లు దాటవు'

విద్యానగర్(కరీంనగర్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 15 సీట్లు దాటవని ప్రజామిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలను గౌరవించని మంత్రులకు ఆ ప్రజలే తగిన గుణపాఠం చెప్పాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రజలను థర్డ్‌క్లాస్ ఫెల్లోస్ అని మాట్లాడడం సరికాదని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో 100 సీట్లు గెలవనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 60వేల కోట్ల ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. బోయినపల్లి చంద్రయ్య, నాయిని ప్రసాద్, రాంరెడ్డి, బాపురెడ్డి, దశరథం, గొర్రె సంపత్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా నూతన కమిటీ



పీడీఎస్‌యూ నూతన కమిటీ

విద్యానగర్: పీడీఎస్‌యూ జిల్లా నూతన కమిటీని శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ.శ్రీకాంత్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన అధ్యక్షుడిగా అభిలాష్, ప్రధాన కార్యదర్శిగా రాణాప్రతాప్‌తోపాటు తొమ్మిది మందిని ఎన్నుకున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థి నాయకులు పీడీఎస్‌యూలో చేరారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు ఆకుల రాములు, పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు శ్రీకాంత్, పవన్, రవి,యశ్వంత్ పాల్గొన్నారు.

అన్నదాతకు ఊరట

- వానాకాలం నుంచి ఇక ఒకే బ్రాండ్
- దిగొస్తున్న ఎరువుల ధరలు
- తగ్గనున్న పెట్టుబడి భారం

2022- 23 వానాకాలంలో జిల్లాలో వినియోగించిన రసాయన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

యూరియా	26,850
డీఏపీ	43,097
ఎంవోపీ	10,201
కాంప్లెక్స్	24,540
ఎస్ఎస్‌పీ	11,089

జిల్లాలో ధరలు ఇలా.. (రూ.లలో)

ఎరువు	ప్రారంభంలో	ప్రస్తుతం
డీఏపీ	1750	1350
20:20:0:13	1450	1175
ఎస్ఎస్‌పీ	600	540
ఇతర	1450	1200



ఎరువుల బస్తాలు

కరీంనగర్ అర్బన్: అంతర్జాతీయంగా ముడి సరుకు ధరలు తగ్గడం అన్నదాతకు ఎంతో ఊరట. సదరు ధరల తగ్గుదల ప్రభావం ఎరువులపై పడుతుండటంతో వానాకాలం సాగుకు పంటపెట్టుబడి తగ్గే అవకాశముంది. ఇప్పటికే ఎరువుల కంపనీలు ధరలు తగ్గుతాయని డీలర్లకు సమాచారమివ్వగా ఇప్పటికే రూ.50కి పైగా తగ్గించాయి. పెట్టుబడి వ్యయం పెరుగుతున్న తరుణంలో ఎరువుల ధరలు దిగిరావడం అన్నదాతకు ఉపశమనమిచ్చే అంశం. ఇప్పటికే కాంప్లెక్స్ 20:20:0:13 ఎరువు ధర రూ.150 తగ్గింది. మరో పది హేను రోజుల్లో మరింత దిగి వచ్చే అవకాశం ఉందని కంపెనీలు ఎరువుల డీలర్లకు సమాచారం ఇచ్చాయి.

వన్ నేషన్ వన్ ఫర్టిలైజర్

కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం కొత్త స్కీంను తీసుకొచ్చింది. వన్ నేషన్ వన్ ఫర్టిలైజర్ స్కీం ను తీసుకొచ్చింది. వన్ నేషన్ వన్ ఫర్టిలైజర్ స్కీం కింద ఎరువులను ఒకే బ్రాండ్ కింద విక్రయించాలని నిర్ణయించింది. ఇకపై భారత్ డీఏపీ, భారత్ పొటాష్, భారత్ యూరియా, భారత్ ఎన్పీకే (కాంప్లెక్సలన్నీ)ల పేరిట అమ్మకాలు జరగనున్నాయి. వీటి బస్తాలకు వేర్వేరు రంగులు కేటాయిస్తూ డిజైన్లు తయారు చేస్తారు. ఈ బ్రాండ్లు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటాయి. ఇకపై వేర్వేరు కంపెనీల పేరుతో ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే వానాకాలం నుంచి కొత్త బస్తాల్లో ఎరువులు వస్తాయి. ఇప్పటికే మొదటి దఫా అక్కడక్కడా కొత్త బస్తాలు ఫర్టిలైజర్ దుకాణాల్లోకి వచ్చాయి.

ధరల నిర్ణయం ఉత్పత్తిదారులదే..

గతంలో ఎరువుల ధర పెరుగుదల, రాయితీలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండేవి. నాలుగేళ్ల క్రితం ధరల నిర్ణయాధికారం కంపెనీలకు ఇచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిపదార్థాల ధరల హెచ్చు తగ్గుదలను బట్టి కంపెనీలు ధరలు నిర్ణయిస్తున్నాయి. కాంప్లెక్స్, డీఏపీ ఎరువుల తయారీకి అవసరమైన పాస్పరిక్ యాసిడ్, పొటాష్, పాస్పరస్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం వాటి ధరలు గణనీయంగా తగ్గడంతో ఎరువుల ధరలు కూడా దిగివచ్చాయి. దీంతో కాంప్లెక్స్ ఎరువు 20-20-0-13 రూ. 1350 ఉండగా నెలకో రూ.50 చొప్పున తగ్గుతూ ప్రస్తుతం రూ.1200కు వచ్చింది. మరో నెల రోజుల్లో అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువు బస్తా (50 కిలోల) రూ.200 నుంచి రూ.300 తగ్గే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ద్రవరూపంలోనూ ఎరువు

ఎరువుల వినియోగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే యూరియా ద్రవరూపంలో నానో పేరిట అందుబాటులోకి రాగా, తాజాగా డీఏపీ కూడా నానో రూపంలో వచ్చింది. వీటితో ఎరువుల వినియోగం మరింత సులభమవుతోంది. ప్రస్తుతం 50 కిలోల డీఏపీ సంచి ధర రూ.1,350 ఉండగా నానో డీఏపీ అరలీటర్ ధర రూ.600తో విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. యూరియా సంచి ధర రూ.266 ఉండగా నానో యూరియా అరలీటర్ రూ. 225 ఉంది.

సెమ్స్ ఒలింపియాడ్‌లో 'మానేరు' ప్రతిభ



మానేరు విద్యార్థులను అభినందిస్తున్న పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు

- అభినందించిన పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు

సప్తగిరికాలనీ(కరీంనగర్): జాతీయస్థాయిలో నిర్వహించిన సెమ్స్ ఒలింపియాడ్ నేషనల్ టాలెంట్ టెస్ట్–2022 ఫలితాల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. టాప్ 10ర్యాంకుల్లో నిలిచి ప్రభంజనం సృష్టించారు. 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలను రెండు స్థాయిల్లో నిర్వహించగా 10వ తరగతికి చెందిన ఎం.సహస్ర 78మార్కులు, 9వ తరగతికి చెందిన హర్షవర్ధన్ 82మార్కులతో ఆల్ ఇండియా నంబర్‌వన్ ర్యాంకులు సాధించారు. 8వ తరగతికి చెందిన ఎస్.వరుణ్‌కుమార్ 72మార్కులు, 6వ తరగతికి చెందిన జోహా ఆనామ్ 66మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఫస్ట్‌ర్యాంక్‌లు కై వసం చేసుకున్నారు. అజ్మతున్నీస్సా, శ్రీరామ్ సంహిత్, పవన్‌తేజ, ఐజా రెహనాజ్, శిరీష, స్నిగ్ధశ్రీ, సనా ఫర్హత్, స్ఫూర్తి, ఇష్టారెడ్డి, సాత్విక్‌రెడ్డి, జెయాన్, రిషికాశర్మ టాప్ 20లో నిలిచారు. పరాక్షిత్‌సారధి, శ్రీలక్ష్మి, వర్షిత్‌కుమార్, అరవింద్‌రెడ్డి, శరత్, ఆరూష్, సానియా, ప్రజ్ఞ, చిన్మయ, బింగి సన్విత టాప్10లో చోటు సాధించారు. విద్యార్థులను శనివారం కరీంనగర్ పోలీస్‌కమిషనర్ సుబ్బారాయుడు అభినందించారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



పంటను పరిశీలిస్తున్న రైతులు

చొప్పదండి: మండలంలోని సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి మల్లయ్య అనే రైతుకు చెందిన రెండెకరాల మొక్కజొన్న పంట శనివారం విద్యుత్‌వైర్ల రాపిడి మూలంగా నిప్పు కణికలు పంటపై పడి దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మల్లయ్య వేసిన మొక్కజొన్న పంటను కోసి కుప్పలు వేశాడు. శనివారం మధ్యాహ్నం గాలులు వచ్చి మొక్కజొన్నతో పాటు, పక్కనే ఉన్న వరి పంటపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు రాపిడికి గురై నిప్పులు వెదజల్లాయి. మంటలు లేచి కంకులు, మొక్కజొన్న కాలిపోయింది. స్థానిక రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా అదుపు చేశారు. అగ్నిప్రమాద స్థలాన్ని బీజేపీ నేతలు సింగిరెడ్డి క్రిష్టారెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డిలు సందర్శించారు. నిరుపేద రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి సీఎంకప్

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- షెడ్యూల్ సిద్ధం చేసిన డీవైఎస్‌వోలు
- జగిత్యాలలో 23 నుంచి ప్రారంభం
- ఎండ నేపథ్యంలో భయం.. భయం

"కరీంనగర్‌స్పోర్ట్స్: చీఫ్ మినిస్టర్స్ కప్–2023 జిల్లాస్థాయి పోటీలు ఈనెల 22 నుంచి 24వరకు జరగనున్నాయి. పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల యువజన క్రీడాశాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోటీలు జరిగే వేదికలు.. షెడ్యూల్‌ను డీవైఎస్‌వోలు, ఒలింపిక్ సంఘం బాధ్యులు సిద్ధం చేశారు. ఈ క్రమంలో జరిగే క్రీడాపోటీల షెడ్యూల్, ఏర్పాట్ల వివరాలతో కథనం.."



మండలస్థాయి పోటీల్లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

భయపెడుతున్న ఎండ.. భోజనంపై అనుమానం

చీఫ్ మినిస్టర్స్ కప్–2023 పోటీలకు మండలస్థాయిలో మంచి స్పందన వచ్చింది. ఓ పక్క భానుడు ప్రతాపం చూపినా.. చాలా ప్రాంతాల్లో ఉదయం.. సాయంత్రం పోటీలు నిర్వహించారు. అయితే సౌకర్యాలు, భోజనాలు లేక క్రీడాకారులు ఇబ్బంది పడ్డారు. రేపటి నుంచి జరిగే జిల్లాస్థాయి పోటీలు సైతం ఉదయం, సాయంత్రం నిర్వహించేలా చూడాలని క్రీడాకారులు కోరుతున్నారు. దూరప్రాంతం నుంచి వచ్చేవారికి భోజన సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

కరీంనగర్‌లో (వేదిక: అంబేద్కర్ స్టేడియం)

- 22న: ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో
- 23న: అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్(పురుషులకు)
- 24న: బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, అర్చరీ, స్విమ్మింగ్, లాన్‌టెన్నిస్, షూటింగ్, టేబుల్‌టెన్నిస్ (పురుషులకు, మహిళలకు), రెజ్లింగ్, హాకీ(పురుషులకు)
- సాయంత్రం 5గంటలకు ముగింపు కార్యక్రమం

రాజన్న సిరిసిల్లలో (వేదిక: మినీస్టేడియం)

- 22న: కబడ్డీ, వాలీబాల్
- 23న: ఖోఖో, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ (పురుషులకు, మహిళలకు), ఫుట్‌బాల్, రెజ్లింగ్ (పురుషులకు)
- 24న: అథ్లెటిక్స్ (పురుషులకు, మహిళలకు)
- సాయంత్రం 5గంటలకు ముగింపు కార్యక్రమం

పెద్దపల్లిలో (వేదిక: జవహర్‌లాల్ నెహ్రూస్టేడియం, గోదావరిఖని)

- 22న: కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ (పురుషులకు, మహిళలకు), ఫుట్‌బాల్ (పురుషులకు)
- 23న: ఖోఖో, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళలు), రెజ్లింగ్ (బాలురు), స్విమ్మింగ్
- 24న: బ్యాడ్మింటన్, బాక్సింగ్
- సాయంత్రం 4:30గంటలకు ముగింపు కార్యక్రమం

జగిత్యాల (స్వామి వివేకానంద స్టేడియం)

- 23న: కబడ్డీ, వాలీబాల్ (పురుషులకు, మహిళలకు), బాక్సింగ్ (పురుషులకు), బ్యాడ్మింటన్ (పురుషులకు, మహిళలకు)
- 24న: వాలీబాల్(పురుషులు), ఖోఖో,స్విమ్మింగ్ (పురుషులకు, మహిళలకు)
- 25న: ఫుట్‌బాల్(పురుషులు), బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ,ఖోఖో
- అథ్లెటిక్స్ (పురుషులకు, మహిళలకు) (వేదిక: ఎస్‌కేఎన్ఆర్)
- 25న: రాత్రి 6గంటల ఎస్‌కేఎన్ఆర్‌లో ముగింపు కార్యక్రమం

సన్నాహాలు చేస్తున్నాం



సీఎంకప్–2023 జిల్లాస్థాయి పోటీలను ఘనంగా నిర్వహించడానికి సన్నహాలు చేస్తున్నాం. పోటీల నిర్వహణపై క్రీడాసంఘాలతో, పీఈటీలు, సీఎంకప్ కమిటీలో సమావేశం అయ్యాం. 22నుంచి గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రు స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నాం. ఎండతీవ్రత దృష్ట ఉదయం 7 నుంచి 11వరకు పోటీలు ఉంటాయి.

– వై.తిరుపతిరావు, ఇన్‌చార్జి డీవైఎస్‌వో, పెద్దపల్లి

మంత్రి చొరవతో సౌకర్యాలు



ఎండతీవ్రత కారణంగా కరీంనగర్‌లో క్రీడాకారులకు మంత్రి గంగుల కమలాకర్ చొరవతో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. అన్నిజిల్లాల్లోనూ క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలి. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ఉమ్మడి కరీంనగర్ పేరు నిలబెట్టాలి.

– నందెల్లి మహిపాల్, సీఎంకప్ నిర్వహణ కమిటీ సభ్యుడు

ఇబ్బందులు లేకుండా..



సీఎంకప్ జిల్లాస్థాయి పోటీలు ఇబ్బందులు లేకుండా జరిగేలా చూసేందుకు ఒలింపిక్ సంఘం నుంచి అబ్జర్వర్‌లను నియమించాం. మూడు రోజులు పోటీలు జరుగుతున్న తీరును పరిశీలించడమే కాకుండా పలు సూచనలు, సలహాలు కూడా అందజేస్తారు. సీఎంకప్ నిర్వహణలో తెలంగాణ ఒలింపిక్ సంఘం కీలక పాత్ర పోషిస్తోంది.

– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, సీఎంకప్ నిర్వహణ కమిటీ సభ్యుడు

కారులో చోరీ



దొంగలు కారు అద్దాలు పగలగొట్టిన దృశ్యం

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అలుగునూర్ శివారులో ఉన్న ఓ రెస్టారెంట్ వద్ద శుక్రవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కర్నె కుమార్ కరీంనగర్ మున్సిపల్ కాంట్రాక్ట్ పనుల్లో భాగంగా ఆర్కిటిక్ డిజైన్ కోసం కరీంనగర్ వచ్చారు. పనులు ముగించుకుని హైదరాబాద్ వెళ్లే క్రమంలో రెస్టారెంట్ వద్ద భోజనం చేసేందుకు ఆగాడు. హోటల్ వద్ద బీఎండబ్ల్యూ కారు నిలిపాడు. ఇదే అదనుగా భావించిన ఇద్దరు గుర్తుతెలియని దొంగలు కారులో భారీగా నగదు ఉంటుందని ఆలోచన పడ్డారు. కారు అద్దాలు ధ్వంసం చేసి అందులోని బ్యాగు తీసుకుని పారిపోయారు. గమనించిన కుమార్ కారులో నగదులేదని, ల్యాప్‌టాప్, డాక్యుమెంట్స్ మాత్రమే ఉన్నాయని తెలిపాడు. అర్జెంట్ వర్క్ మీద హైదరాబాద్ వెళ్లిపోయాడు. శనివారం కుమార్ కొడుకు మనాల్ ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు నమోదైనట్లు పేర్కొన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్సై వెల్లడించారు.

ఎంసీహెచ్‌లో మహిళా ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

కరీంనగర్‌టౌన్: ఎంసీహెచ్‌లో సెక్యూరిటీ విభాగంలో పనిచేసే ఓ మహిళా ఉద్యోగిని శనివారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకెళితే... ఎస్ఎస్‌సీయూలో పనిచేసే సదరు మహిళకు విధుల విషయంలో తోటి సిబ్బందితో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. అయినప్పటికి పరిస్థితిలో మార్పు రాకపోవడంతో రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిన సదరు ఉద్యోగిని మానసిక క్షోభకు గురై బీపీ గోలీలు ఎక్కువ మొత్తంలో మింగినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉండగా, ప్రస్తుతం ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

'బీసీబంధు' ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎన్నం ప్రకాశ్

కరీంనగర్: కులవృత్తులు చేసుకునే వారికి రూ. లక్ష ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ డిమాండ్ అన్నారు. శనివారం మంక్కమ్మతోటలోని బీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ బీసీ బంధు ప్రకటించి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించాలని, వచ్చే ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్, జిల్లా ప్రధానకార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, ఉపాధ్యక్షుడు దుంపట మురళి, రాష్ట్ర కార్యదర్శి శానగొండ శ్రీనివాస్, వరాల జ్యోతి, గంగిపెల్లి అరుణ, దేవరకొండ సంతోషి పాల్గొన్నారు.

'పద్మశాలి' గుర్తింపు కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం

గన్నేరువరం: మండలంలోని పద్మశాలి సంఘం సభ్యులకు గుర్తింపు కార్డులు జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం అందజేశారు. గన్నేరువరంలో మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో రూ.5కోట్లతో పద్మశాలి సంఘం భవన నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ నిర్మాణానికి సంకల్పిస్తే తమవంతు సహకారం ఉంటుందన్నారు. గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, కార్యదర్శి ఒజ్జాల కృష్ణహరి, కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, ఉపాధ్యక్షుడు తెల్ల చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి బూర శ్రీనివాస్, కోశాధికారి బొల్లి రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూర తిరుపతి, ఉపాధ్యక్షుడు తెల్ల రవీందర్, బూట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి

మంథని: మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో కుసుమ రాజేందర్(35) పాముకాటుతో మృతి చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేయడంతో మంచంలోనే తుదిశ్వాస విడిచాడు. శనివారం ఉదయం స్థానికులు గమనించడంతో శరీరంపై పాముకాట్లు ఉన్నాయి. రాజేందర్ తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నాడని, మద్యానికి బానిసయ్యాడని, ఇంట్లో విద్యుత్ సరఫరా కూడా ఉండదని, చీకటిగా ఉంటుందని స్థానికులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

గోదావరిఖని: గోదావరిఖనిలోని గాంధీనగర్‌కు చెందిన రాళ్లదండి సంతోష్(40) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పెళ్లి అయిన తర్వాత విడాకులు ఇవ్వడంతో మద్యానికి బానిసైనట్లు వెల్లడించారు. శుక్రవారం మద్యంతాగి వచ్చి ఇంటి వెనగాల గల మామిడి చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి తల్లి నాగరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.